

అక్టోబర్ 31న పైడితల్లి సిరిమానోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

అక్టోబర్ 31న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఇఒ కె.ఎల్.సుధారాణి తెలిపారు. అక్టోబర్ 4న పందిరి రాట వేయడంతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో పైడితల్లి ఉత్సవ తేదీలను ఆమె ప్రకటించారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు నెల రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. అక్టోబర్ 30న తొలేళ్ల ఉత్సవం ఉంటుందని, మరుసటి రోజు అక్టోబర్ 31న అంగరంగ వైభవంగా సిరిమానోత్సవం జరుగుతుందని వెల్లడించారు. నవంబర్ 7న పెద్దచెరువు వద్ద తెప్పోత్సవం, 14న ఉయ్యాల కంబాల ఉత్సవం ఉంటుందని వివరించారు.



నాడు విఆర్ఎస్

నేడు గిరిజన వర్సిటీ

- నియోజకవర్గంలో ఉన్నా నిరుపయోగం
- పెత్తందార్ల స్వార్థానికి సాలూరు బలి
- గిరిజన ఎమ్మెల్యేలను కీలుబొమ్మల్ని చేసిన వైనం

నాడు వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు, నేడు గిరిజన యూనివర్సిటీ రెండూ పేరుకు సాలూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. కానీ వీటితో నియోజకవర్గానికి ఎలాంటి ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. వీటి వల్ల వెనుకబడిన నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం దోహద పడదు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రగతి ఫలాలు అందించలేవు. ఎందుకంటే అప్పుడున్న, ఇప్పుడు న్న పెత్తందార్ల స్వార్థానికి సాలూరు నియోజకవర్గం బలిపశువుగా మారుతోంది. అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా సాలూరు నియోజకవర్గం తయారైంది. అనాదిగా జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే వారు లేక పెత్తందార్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది.

ప్రజాశక్తి - సాలూరు

సుమారు నాలుగు న్నర దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేసిన వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు పేరుకు సాలూరు మండలంలోని లక్ష్మీపురంలో ఉంది. 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 24,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం కల్పించేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. అయితే ఈ ప్రాజెక్టు సాలూరు నియోజకవర్గంలో ఉన్నా సాలూరు మండలం, మున్సిపాలిటీ, పాచిపెంట, రామభద్రపురం మండలాల్లో ఎకరా భూమికి కూడా సాగునీరందని పరిస్థితి. తొలుత ఈ ప్రాజెక్టును సాలూరు మండలంలోని సారిక పంచాయతీ దండిగాం వద్ద నిర్మించాలని భావించారు. ఇక్కడ నిర్మిస్తే మండలంలోని మామిడిపిల్లి, మరిపిల్లి, మామిడిపల్లి, బాగువలస, పురోహితునివలస గ్రామాలకు సాగునీటి సౌకర్యం కలిగేది. అయితే ఈ డిజైన్‌ను అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి వాసిరెడ్డి కష్ణమూర్తి నాయుడు మార్పించి ఈదుల దండిగాం వద్ద నిర్మించడానికి ప్రణాళిక రూపకల్పన చేశారు. విఆర్ఎస్ జలాశయం నుంచి నీరు తీసుకుపోయేలా పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాల్లో భూములకు సాగునీరందించేలా రూపకల్పన చేసి కాలువల నిర్మాణం చేపట్టారు. ఈ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న జన్ని ముత్యాలు నియోజకవర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించలేకపోయారు. అయితే సాలూరుకు చెందిన పలువురు నాయకులు కోర్టులో కేసు వేసినా ప్రయోజనం లేకపోయింది. సాలూరు మండలంలోని కొండకోనల్లో నుంచి జాలువారిన నీరు సువర్ణముఖి, గోముఖి అనే పాయల ద్వారా వెంగళరాయ సాగర్ జలాశయంలోకి చేరుతుంది. అప్పుడే నియోజకవర్గ ఎమ్మెల్యే గాని, స్థానిక పెత్తందారీ నాయకులు గాని జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించి ఉంటే విఆర్ఎస్ నీటితో కనీసం మండలంలోని భూములైనా సస్యశ్యామలమయ్యేవి. కానీ ప్రశ్నించే నాయకులు, నిలదీసే ప్రజలు లేకపోవడంతో పెత్తందారీ నాయకులు వారి ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుకూలంగా ప్రాజెక్టును వాడుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నియోజకవర్గానికి అన్యాయం జరుగుతూనే ఉంది.

తాజాగా కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ విషయంలో కూడా నియోజకవర్గానికి అన్యాయమే జరిగింది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజన్నదొరను ఉత్సవ విగ్రహంగా చేసి జిల్లా రాజకీయాలను శాసించే నాయకులు గిరిజన యూనివర్సిటీని విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేయించుకున్నారు. పేరుకు సాలూరు నియోజకవర్గంలో ఉన్నట్టు తాత్కాలికంగా కనిపిస్తున్నా భవిష్యత్తులో పూర్తిగా విజయనగరం జిల్లాకే చెందుతుంది. నియోజకవర్గ పరిధిలోని మెంటాడ మండలం ఇప్పుడు విజయనగరం జిల్లా లోనే ఉంది. మరో మూడేళ్లలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజనలో మెంటాడ మండలం గజపతినగరం నియోజకవర్గంలోకి వెళ్లిపోతుంది. ఇటీవల సిఎం జగన్ మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి భూమి పూజ చేయించారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాకు తీరని అన్యాయం చేసినట్లయింది. నాడు వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్యే జన్ని ముత్యాలు ప్రశ్నించలేకపోవడం వెనుక పెత్తందారీ రాజకీయాలు అప్పట్లో బలంగా వుండడమే కారణమని చెప్పవచ్చు. ఇప్పుడున్న ఎమ్మెల్యే రాజన్నదొర డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో ఉన్నప్పటికీ కళ్లముందు కనిపించే అన్యాయాన్ని ప్రశ్నించలేకపోయారు. ఉన్నత విద్యాలయం తుడైనప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో జరుగుతున్న అన్యాయం గురించి నిలదీయలేక పోయారు. పెత్తందార్ల రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం నియోజకవర్గ అభివృద్ధి పణంగా మారింది. గిరిజనుల ముంగిటే గిరిజన యూనివర్సిటీ అని ప్రచారం చేస్తూ పెత్తందారులు మన్యం జిల్లా గిరిజనులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నాడు విఆర్ఎస్ ప్రాజెక్టు విషయంలో గానీ, నేడు గిరిజన యూనివర్సిటీ విషయం లో గానీ నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించలేకపోవడం వెనుక పెత్తందారీ రాజకీయ చట్రంలో గిరిజన ఎమ్మెల్యేలు పావులుగా మారడమే ప్రధాన కారణమని తెలుస్తోంది.



గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ (ఫైల్)

సాలూరు ప్రాంతంలో వర్శిటీ ఉంటే...

ఒకవేళ కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ నియోజకవర్గంలో ఉన్న దుగ్ధసాగరం భూముల్లో గాని, పాచిపెంట మండలంలోని మాన్సాస్ భూముల్లో ఏర్పాటు చేసి ఉంటే వెనుకబడిన గిరిజన నియోజకవర్గ రూపురేఖలు మారిపోయే అవకాశం ఉంటుంది. టిడిపి ప్రభుత్వ హయాంలో పరిశీలించిన ప్రతిపాదిత మాన్సాస్ భూములకు దగ్గర గానే గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వెళుతోంది. వైసిపి ప్రభుత్వం హయాంలో పరిశీలించిన దుగ్ధ సాగరం భూములకు కూడా సమీపం నుంచే గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వెళుతోంది. ఈ రెండు ప్రదేశాల్లో ఎక్కడ ఏర్పాటు చేసినా నియోజకవర్గానికి చెందిన వందలాది మంది కూలీలకు, యువతకు ఉపాధి అవకాశాలు లభించేవి. ఇలాంటి ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఏర్పాటైతే ఈ ప్రాంత భూములకు ధరలు పెరిగేవి. ఫలితం సాలూరు పట్టణాభివృద్ధి కూడా ఊహించని రీతిలో జరిగేది. విద్య, వైద్య రంగాల్లో వెనుకబడిన గిరిజన ప్రాంతంలో అభివృద్ధి కుసుమాలు వికసించడానికి మార్గం ఏర్పడేది.



పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస వద్ద జగనన్న కాలనీని పరిశీలిస్తున్న హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్

ఇళ్ల నిర్మాణాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు

గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో అంకిత భావం ప్రదర్శించి, ప్రతిభ కనబరిచి, పూర్తి చేసిన వారికి ప్రత్యేక అవార్డులు అందజేస్తామని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఉత్తరాంధ్ర ప్రత్యేక అధికారి మహమ్మద్ దివాన్ మైదీన్ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన హౌసింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ సహాయకులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటికే 5 లక్షల గృహాల నిర్మాణం పూర్తి చేసుకున్నామని, డిసెంబరు నాటికి అదనంగా మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. పెద్ద ఎత్తున సాగుతున్న గృహ నిర్మాణాల్లో అవార్డుల సాధనకు ప్రయత్నించాలని సూచించారు. ఈ జిల్లాలో ప్రగతి బాగుందని ఆయన ప్రశంసించారు. జిల్లాలో మంజూరైన అన్ని గృహాలు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గృహాల నిర్మాణ స్థాయి మారడం మాత్రమే కాదని, ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రతి కాలనీలో ఇంకుడు గుంతలు ఉండాలని, 25 గృహాలు దాటి ఉన్న కాలనీలకు అర్చిల నిర్మాణం ఉండాలని తెలిపారు. బిల్లులను నిర్దేశిత సమయంలో అప్ లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ సహాయకులు పనులపై శ్రద్ధ వహించాలని, సహాయ ఇంజినీర్లు బాధ్యతతో పర్యవేక్షణ చేయాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న ఆర్జీల పరిష్కారంలో శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పిఎంఎవై గ్రామీన్‌కు ముందస్తుగానే రూ.40 వేలు అందిస్తున్నామని చెప్పారు. ప్రగతిలో వెనుకబడిన మండలాలు నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులను ప్రేరేపించి నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్నామని చెప్పారు. జిల్లాకు 27,142 ఇళ్లు మంజూరు కాగా, 23,805 ఇళ్ల నిర్మాణం చేపట్టామని, 11,844 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. పునాదుల స్థాయిలో 5227, రూఫ్ స్థాయిలో 1774, రూఫ్ కాస్టింగ్ స్థాయిలో 346 ఉన్నాయి. పునాదుల పూర్తి అయ్యే స్థితిలో 4614 ఉన్నాయని వివరించారు. కాలనీల్లో రూ.5కోట్లతో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సెప్టెంబర్ నెలాఖరుకు 2వేల ఇళ్లు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాబోయే 3, 4 రోజుల్లో వంద ఇళ్లు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.63 లక్షలు విడుదల చేశామన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి తీర్మానాలు శత శాతం సోమ వారం నాటికి అందాలని ఆయన చెప్పారు. సమావేశంలో జెస్ ఆర్.గోవింద రావు, హౌసింగ్, డిఆర్‌డిఎ పీడీలు టి.రమేష్, పి.కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యు.స్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : అనంతరం పట్టణంలోని కొత్తవలసలో గల గ్రీన్‌ఫీల్డ్ జగనన్న కాలనీ లే అవుట్, వెంకంపేట వద్ద ఉన్న జగనన్న లేఔట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడుతో కలిసి పరిశీలించారు. కాలనీల్లో ప్రత్యేక మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని సూచించారు. పరిశీలనలో డిఇ, ఎఇ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆగస్టు సమావేశం హాంఫట్

కౌన్సిలర్ల వేతనం కట్ ● రెగ్యులర్ కమిషనర్ లేకపోవడమే

ప్రజాశక్తి - సాలూరు

ప్రతినెలా మున్సిపల్ సాధారణ సమావేశం జరగాల్సిన అవసరం ఉందని నిబంధనలు చెపుతున్నాయి. ఆ నెలలో పట్టణానికి సంబంధించిన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ ఆమోదానికి అజెండాలో పొందుపరిచాల్సి ఉంది. ప్రతి నెలాఖరులో సాధారణ సమావేశాలు నిర్వహిస్తారు. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటే అజెండాలో ఉండాల్సిన అంశాలపై చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లతో చర్చిస్తారు. చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ కూడా తన భర్త అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో పురపాలనపై దృష్టి సారించడం లేదు. కమిషనర్ శంకరరావు సస్పెండ్ అయి 20రోజులయింది. ఇంతవరకు కొత్త కమిషనర్ నియామకం జరగలేదు. పూర్తి అదనపు బాధ్యతలతో ఇంఛార్జి బాధ్యతలు ఎఇ సూరి నాయుడుకు అప్పగిస్తూ మున్సిపల్ డైరెక్టర్ ఆదేశాలిచ్చారు. కానీ డిఇ బాధ్యతలు కూడా ఆయనే నిర్వహిస్తుండడంతో అయిష్టంగానే ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలు చేపట్టారు. వారం రోజులు తిరగకుండానే ఆయన సెలవు పెట్టారు. డెలిగేషన్ కమిషనర్‌గా ఉన్న మేనేజర్ రాఘవాచార్యులు కూడా సమావేశం నిర్వహణకు సంసిద్ధత వ్యక్తం చేయలేదు. దీంతో ఆగష్టు నెల సమావేశం హాంఫట్ అయింది. ప్రతినెలా కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటే కౌన్సిలర్లకు గౌరవ వేతనం మంజూరవుతుంది. ఈనెల సమావేశం లేకపోవడంతో కౌన్సిలర్ల వేతనం మంజూరు కాదు. పాలకవర్గంలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు, పాలనా యంత్రాంగంలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితులు వెరసి ఆగష్టు సమావేశం లేకుండా చేశాయి. మున్సిపాలిటీ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్ణపాడు వంతెన పనులు ప్రారంభించాలి

కలెక్టర్‌కు వంతెన సాధన కమిటీ వినతి

ప్రజాశక్తి - బెలగాం

పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులు వెంటనే పునః ప్రారంభించాలని కోరుతూ కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వంతెన సాధన కమిటీ సభ్యులు గురువారం వినతిని అందజేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుతం నదిలో నీరు ఎక్కువగా ఉండడం వల్ల నవంబర్‌లో పనులు పునఃప్రారంభిస్తామని చెప్పారు. దీనికి కమిటీ సభ్యులు మాట్లాడుతూ వి.ఇందిర, కె.సాంబమూర్తి మాట్లాడుతూ ఇప్పుడు వంతెన పనులు ప్రారంభిస్తే పూర్ణపాడు వైపు కూడా పనులు చేసుకోవడానికి వీలుంటుందని వర్షాలు తగితే నదిలో వేసవిలో మూడు ఫిల్లర్ల పనులను సులభంగా చేసుకోవచ్చని చెప్పారు. దీనికి కలెక్టర్ స్పందించి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు 2006లో ప్రారంభించి నేటికి 14 సంవత్సరాలు దాటినా సగం పనులు చేయడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి రూ.14 కోట్లు వెంటనే విడుదల చేసి వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి అటు 60 గిరిజన గ్రామాలు ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. సెప్టెంబర్ నెలాఖరుకు వంతెన పనులు ప్రారంభించక పోతే భవిష్యత్తులో సాధన కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు వి.దాలినాయుడు, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు, పల్లా సురేష్, పాలక రంజిత్ కుమార్, డొక్కర సీతారాం, ఆరిక చంద్రశేఖర్, పాలక గౌరమ్మ, ఎ.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు







కురుపాం సంతలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు వేణు, శ్రీనివాసరావు ; పాలకొండలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు తిరుపతిరావు ; గరుగుబిల్లిలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు మన్మధరావు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం సమరభేరిపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతూ, కార్పొరేటర్లకు ప్రభుత్వ రంగ సంస్థలను, అడవులను, ప్రకృతి సంపదను దోచిపెడుతున్న బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఐక్యమై తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం తలపెట్టిన సమరభేరి ప్రచారంలో భాగంగా జిల్లాలో పలుచోట్ల ప్రభుత్వ విధానాలపై సంతకాల సేకరణ, ప్రచార కార్యక్రమాలను గురువారం కొనసాగాయి. ఇందులో భాగంగా కురుపాం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతలో రెడ్డి వేణు, మండల కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు తో కలిసి ప్రచారం నిర్వహించి సంతకాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరిగాయని, వీటిని రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు వ్యతిరేకించడం లేదని విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు ప్రతి నెలా పెంచుతున్నారని, వీటితో పాటు మరిన్ని ప్రజావ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలభిస్తున్నా యని, వీటికి వ్యతిరేకంగా విపోరాడాలని పిలుపునిచ్చారు. సమరభేరి కార్యక్రమంలో భాగంగా బుధ, గురువారాల్లో సంతకాలు సేకరణ చేపట్టామన్నారు. శుక్రవారం సచివాలయాల వద్ద వినతి పత్రం అందజేస్తామని, 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా చేపడతామని ఈ కార్యక్రమానికి ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.సింహాచలం, గౌరీశ్వర తదితరులు పాల్గొన్నారు. అనతరం మండలంలో గుజ్జువాయి పంచాయతీ భారామని, భారమనిగూడ, గూడ కాలనీ, కొత్తగూడ తదితర గిరిజన గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి. వాసు, అంగద, జ్యోతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: నగర పంచాయతీ ఎన్.కె రాజపురంలో బిజెపి, వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలపై సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఎం మండల కమిటీ కన్వీనర్ డి. రమణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, సంతకాల సేకరణ చేసి సెప్టెంబర్ 1న సచివాలయం వద్ద, సెప్టెంబర్ 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.లక్ష్మణరావు, ఎం.రమేష్, జివిఎం సుందరరావు, 3, 5 వార్డుల పౌరులు ఎం.రామినాయుడు, సిహెచ్ శ్రీకాంత్, ఎ. వెంకటరమణ, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: కేంద, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా అధిక ధరలు తగ్గించాలని, ఉపాధి కల్పించాలని పాలకొండ పట్టణం గారమ్మ కాలనీలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల పార్టీ నాయకులు డి. దుర్గారావు, కె. రాము గురువారం ప్రజలు వద్ద సంతకాలు సేకరణ చేపట్టారు.

పార్వతీపురం టౌన్ : ధరలు తగ్గించాలని, ఉద్యోగాలు కల్పించాలని, విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో గల 24,25వ వార్డుల్లో ఇంటింటికి వెళ్తూ సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, నాయకులు, బంకురు సూరిబాబు, ముట్నూరు వెంకటరమణ, కొత్తగుండు గణేష్, లాడి అశోక్ కుమార్, రాహుల్, శిరేల మోహన్, మహిళలు పాల్గొన్నారు.

సాలూరు : పట్టణంలోని మహంతి వీధి, నెయ్యిలవీధి, వేగావతీ కాలనీ, బంగారమ్మపేటల్లో సమరభేరి కార్యక్రమంలో భాగంగా సంతకాలు సేకరణ చేపట్టారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు కె.వెంకటరావు, మంగమ్మ పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక మార్కెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం సమరభేరి పేరిట సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు నక్క త్రినాధరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : సమరభేరి కార్యక్రమంలో భాగంగా సొంపిగాం, సారిక, కొత్తూరు గ్రామాల్లో సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సూకురు గంగయ్య, మండల కమిటీ సభ్యులు చింత జోగయ్య, గెమ్మెల బోడమ్మ, సూరయ్య, మెల్లిక కాముడు, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : సిపిఎం ఆధ్వర్యాన మండల కేంద్రంలో సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకులు ధరలు రోజురోజుకీ పెంచుతున్నారని, కరెంటు బిల్లు ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి ఉందని ప్రజలపై ఆర్థిక భారాల మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఖండించాలని అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సచివాలయాల ముందు నిరసనలు, సెప్టెంబర్ 4న తహశీల్దారు కార్యాలయాల ముందు ధర్నాలు జరుగుతాయని, ఈ కార్యక్రమాల్లో ప్రజలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధా, నాగయ్య, వెంకటరమణ, లక్ష్మణ, సింహాచలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని రావుపల్లిలో ప్రచారం, సంతకాల సేకరణ జరిగింది. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.మన్మధరావు, నాయకులు గేదెల రామ్మూర్తి నాయుడు. ప్రకాశం. సాంబయ్య. శివ. సింహాచలం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.



భామినిలో గిరిజన విద్యార్థులతో ముచ్చటిస్తున్న ట్రైనీ ఐఎఎస్‌లు

పథకాల అమలుపై గిరిజనులతో మాటా మంతీ

ప్రజాశక్తి - భామిని

ట్రైనీ ఐఎఎస్‌లు నాలుగో రోజు మండలంలోని బొడ్డగూడ పంచాయతీ పరిసర గ్రామాల్లోని గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గిరిజనులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ముఖ్య పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనం, ఆ పథకాల వల్ల ప్రజలు ఎంతమేరకు సంతృప్తిగా ఉన్నారు వంటి విషయాలపై గ్రామంలోని పెద్దలు, యువకులతో మాట్లాడారు. అలాగే గిరిజనుల కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాల వల్ల కలిగే లబ్ది, ఆయా పథకాలు మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు ఎంతమేర చేరవవుతున్నాయి వంటి అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. గ్రామంలో జరుగుతున్న సంతను పరిశీలించారు. గృహ నిర్మాణ లబ్దిదారులతో మాట్లాడారు. అనంతరం గ్రామమంతా సందర్శించారు.

పూతికవలసలో...

సీతంపేట : మండలంఒలని పూతికవలసలో ట్రైనీ ఐఎఎస్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనం, ప్రజలు ఎంతమేర సంతృప్తిగా ఉన్నారు వంటి విషయాలపై గ్రామంలోని పెద్దలు, యువకులతో మాట్లాడారు. అలాగే గిరిజనుల కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాల వల్ల కలిగే లబ్ది, ఆయా పథకాలు మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు ఎంతమేర చేరువవుతున్నాయి వంటి అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిడి రమణ, లైజనింగ్ అధికారులు మంగవేణి, కోటిబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

విద్యార్థులు అతిథి ఉపన్యాసాల ద్వారా వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన, భౌతిక శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో హోమి బాబా నేషనల్ ఇన్స్టిట్యూట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఐజిసిఎఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.జగదీశ్వరరావుచే అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ ప్రాముఖ్యత, సిఎఫ్సి వాయువుల వల్ల, అధిక సి ఓటు వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ ఉపన్యాసకులు, పిజి కోఆర్డినేటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు, శ్రీకాకుళం, ఎస్. రామకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి. జయమణి, భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల అధిపతులు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


పిఎసిఎస్ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పిఎసిఎస్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని ఆరబిఆర్ పేట పంచాయితీ పరిధిలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన భవన సముదాయాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ మండల ఎంపిపి, వైస్ ఎంపిపిలు, సర్పంచ్, ఎంపిటీసీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు అభినందన

ప్రజాశక్తి - పాలకొండ

ఏపి ఎన్జీవో సంఘం డివిజన్ కోశాధికారిగా శ్రీనివాసరావు ఇటీవలే నియామకం కావడంతో గురువారం స్థానిక ఉపఖజానా కార్యాలయానికి ఎన్జీవో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, డివిజన్ గౌరవ అధ్యక్షులు లిల్లీ పుష్పనాధం చేరుకుని అభినందించారు. ఉద్యోగుల సమస్యల్లో నిరంతరం శ్రమిస్తున్నది ఎన్జీవో సంఘం మాత్రమే అని అన్నారు. వీరితో పాటు ఎన్జీఓ భోగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఎన్ఎంఎస్‌కి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలిక విద్యార్థులకు ఎన్ఎంఎస్‌కి ఎంపిక నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు టి.శంకర్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 41 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి సెలెక్షన్‌లో భాగంగా పరుగు పందెం, శారీరక దారుఢ్య పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంఎస్ ఎస్ఎలు బి.భుజంగరావు, కె.అరుణ జ్యోతి, ఇండియన్ ఆర్మీ హెల్పర్లు శ్రీనివాసరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కొరమ కూడలిలో వైఎస్ వర్ధంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని కొరమ కూడలి వద్ద గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతిని ఈనెల 2న నిర్వహిస్తున్నామని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, నాయకులు ఆగూతముడి రఘుపతి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం ప్రజా ప్రతినిధులు, సచివాలయం కన్వీనర్లు, నామినేటెడ్ చైర్మన్లు, వైసిపి కార్యకర్తలు, గృహ సారథులు, సర్పంచ్, ఎంపిటిసిలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.


పుస్తకాలతో విద్యార్థులు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

జియమ్మవలస మండలం రావాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు యూత్ ఎంపవర్మెంట్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన విద్యార్థులకు తమ సొసైటీ ద్వారా నోటు పుస్తకాలు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని వారు చదువుకోవడానికి తమ సొసైటీ ద్వారా చిరు సాయం అందించామని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అనురాధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న పిఒ విష్ణుచరణ్

తాపీ మేస్త్రీ కుమార్తెకు ఎంబిబిఎస్ ఫ్రీ సీటు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ చింతమానుగూడ గిరిజన గ్రామానికి చెందిన మండంగి సోనియా అనే గిరిజన విద్యార్థికి కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో ఫ్రీసీటు వచ్చింది. ఈమె తండ్రి సుబ్బారావు తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తూ ఈమె చదువులు నిమిత్తం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక సర్పంచ్ ఎ.మన్మధరావు పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ వద్దకు తీసుకువెళ్లి కుటుంబం ఆర్థిక పరిస్థితులు తెలిపారు. ఈ మేరకు పిఒ రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సోనియా తల్లిదండ్రులు, సర్పంచ్ పిఒకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిడి కె.నివాసరావు పాల్గొన్నారు. చింతమానుగూడలో మొదటిసారిగా ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించిన సందర్భంగా గ్రామంలో ఆమెకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఎజెండాపై చర్చించాలి

ప్రజాశక్తి- వీరఘట్టం

ఎజెండా ప్రాప్తికి చర్చించాలని ఎంఇఒ ఆర్.ఆనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎఫ్ఏ 1, పరీక్ష ఫలితాలు విశేషణ అసెస్మెంట్ క్వశ్చన్ ఫార్మేట్సు టీచిటూల్, ఎఫ్ ఎల్ ఎన్ సోషల్ ఆడిట్ లైబ్రరీ బుక్స్, తదితర విషయాలు చర్చించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ సుంభరో ఎస్, కార్యదర్శి కె.విజయకుమార్, డిఆర్‌పి మజ్జి పైడిరాజు, సిఆర్‌పి వెంకటలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యాన జంగిల్ పనులు

ప్రజాశక్తి - బలిజిపేట

బొబ్బిలి-బలిజిపేట ప్రధాన రహదారిలో మలుపుల వద్ద ఉన్న జంగిల్ పనులను స్థానిక ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్ సమక్షంలో గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మలుపుల వద్ద వర్షాలు ప్రభావం వల్ల చెట్లు, తుప్పలు విపరీతంగా పెరిగిపోయి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనదారులకు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. వీటిని తొలగించేందుకు మలుపుల వద్ద ఉన్న జంగిల్ పనులను చేపట్టామన్నారు. ప్రయాణికులు మలుపులు వద్ద వేగాన్ని తగ్గించుకొని ప్రయాణించాలన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని కోరారు.


రోడ్డు పక్కనున్న పిచ్చిమొక్కలు, తుప్పలను జెసిబితో తెలగిస్తున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

విఎస్ఎస్ భూమిపై హక్కు కల్పించాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తరతరాల నుంచి సాగు చేస్తున్న జెకెపాడు విఎస్ఎస్ ఉమ్మడి భూమిపై స్థానిక గిరిజనులకు హక్కు కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ ఎల్విన్‌పేట పంచాయతీ జెకె పాడు గ్రామ సమీపంలో ఉన్న వన సంరక్షణ సమితి భూమిని అదే గ్రామానికి చెందిన గిరిజనులు గత కొన్నేళ్ల నుంచి సాగు చేస్తూ భూమిపై ఉమ్మడి హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి అటవీశాఖ అధికారులు గిరిజనులకు పట్టాలు కూడా మంజూరు చేశారన్నారు. ఈ తరుణంలోనే విఎస్ఎస్ భూమిని కాపాడుకుంటూ వస్తున్నారని తెలిపారు. అయితే ఇటీవల కాలంలో కొందరు నాయకులు ఇళ్ల స్థలాల పేరుతో బయట ప్రాంతానికి చెందిన గిరిజనులను తీసుకొచ్చి విఎస్ఎస్ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా తోలుఖర్జ, మంగళాపురం గ్రామాలకు చెందిన గిరిజనులకు, జెకెపాడు గిరిజనులకు మధ్య తగద పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ఇతర గ్రామాల గిరిజనులను తీసుకొచ్చి భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న నాయకులుపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, ఉమ్మడి విఎస్ఎస్ భూమికి రక్షణ కల్పించాలని రెవిన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, జెకెపాడు గిరిజనులు ఉన్నారు.


బిఎల్ఒలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డిఒ హేమలత

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

ఓటరు తొలగింపు ప్రక్రియను ఆర్‌డిఒ కె.హేమలత గురువారం పరిశీలించారు. మండలంలోని గుచ్చిమిలో 108, 109 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు తొలగింపును పరిశీలించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఓటరు నమోదు అధికారి పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామని, అందులో బూత్‌స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఓటరు తొలగింపు ప్రక్రియను, వివరాలను తెలియజేయడం ద్వారా మరింత పారదర్శకంగా ఉంటుందని సూచించారని చెప్పారు. ప్రతినిధుల సూచన మేరకు గురువారం బూత్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి తొలగింపు వివరాలు వెల్లడించాలని బిఎల్ఒలను ఆదేశించామని ఆమె పేర్కొన్నారు. పార్వతీపురం నియోజక వర్గంలో అన్ని బూత్‌ల్లో బిఎల్ఒలు సమావేశాలు ఏర్పాటు చేశారని చెప్పారు. బూత్ స్థాయి ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించడం జరుగుతోందన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె తెలిపారు. తొలగింపు జరిగిన ఓట్లపై సందేహాలుంటే వెంటనే తెలియజేయాలని ఆమె కోరారు. బూత్ స్థాయి ఏజెంట్లతో ఆర్‌డిఒ ముఖాముఖి మాట్లాడుతూ వారి సందేహాలను నివృత్తి చేశారు.

నీటి సరఫరాకు అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అపార్ట్మెంట్లు, గ్రూప్ హౌస్‌కు వ్యాపార నిమిత్తం గల యజమానులకు మున్సిపాలిటీ ద్వారా కొత్తగా కుళాయి కనెక్షన్ వేసుకొనేందుకు చెల్లించాల్సిన మంచినీటి ఛార్జీలు డొనేషన్, నెలవారీ ఛార్జీలకు సంబంధించి ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ తీర్మానం జరిగింది. ఈ తీర్మానంపై ఎవరికైనా అభ్యంతరాలుంటే వారం రోజుల్లోగా స్థానిక మున్సిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ జె రామ అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాగునీటి సరఫరాలో అవాంతరాలకు సహకరించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

నగర పంచాయతీలోని వెంకంపేట వాటర్ ట్యాంకుకు సంబంధించిన సంకిలి ఏరియాలో పురాతన (సుమారు 30-40సంవత్సరముల క్రితం) పంపింగ్ బోర్లు రిపేర్ అయినందువల్ల ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామని, కావున తాగునీటి సరఫరాలో వచ్చే అవంతరాలకు ప్రజలు సహకరించాలని కమిషనర్ సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. పై ట్యాంక్ పరిధిలో గల 1,2,12,18,19,20 వార్డులకు నీరు విడిచి పెట్టే సమయంలో బురద నీరు, నల్లని నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున పట్టణ ప్రజలు నీరు పట్టే సమయంలో కొంత సమయం విడిచిపెట్టి పైపుల్లోని మురికి నీరు పోయిన అనంతరం నీరు పట్టుకోవాల్సిందిగా తెలిపారు. అవసరమైన చోట్ల 2 వాటర్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని, ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూస్తున్నామని తెలిపారు. రిపేరు అనంతరం నీటిసరఫరా యధావిధిగా ఇవ్వగలమని, సహకరించాలని ప్రజలను ఆయన కోరారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన

జిల్లా మలేరియా నిర్మూలన అధికారి శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మలేరియా నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా మలేరియా నిర్మూలన అధికారి జి.శ్యామ్‌కుమార్ అన్నారు. గురువారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'మంచం పట్టిన మన్యం" అన్న వార్తకు స్పందించి ఏజెన్సీలో పర్యటించారు. మండలంలోని కేడి కాలనీ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి మలేరియా నిర్మూలనపై అవగాహన ఉండి గిరిజన గ్రామాల్లో మలేరియాను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందజేసిన దోమతెరలను ప్రతి ఒక్కరూ వాడాలని సూచించారు. అలాగే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొని, వీధి కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అలాగే పాఠశాలల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియాను నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట పార్వతీపురం మలేరియా కన్సల్టెంట్ రామచంద్రుడు, భద్రగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్, ఆరోగ్య సహాయకులు రాధాకష్ణ, తదితరులు ఉన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎ.జోగారావు

ఆహా కేంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అందుబాటు ధరకే సాధారణ ప్రజలకు భోజనాలు సమకూర్చేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక బెలగాం చర్చి సెంటర్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తూ ప్రతి మహిళను లక్షాధికారిగా చేసేందుకు గాను ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా వైయస్సార్ ఆసరా, చేయూత ఆర్థిక సహాయంతో మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో మున్సిపాల్టీ పరిధిలో గల మహిళా సంఘాలచే ఆహా క్యాంటీన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అతి తక్కువ ధరకే ప్రజలకు భోజనాలు అందచేసి అటు ప్రజలకు ఇటు మహిళా సంఘం సభ్యులకు ఎంతగానో ఉపయోగపడేలా ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం ర్యాలీ సందర్భంగా ఎమ్మెల్యేకు పలువురు మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మెప్మా సంఘం సభ్యులు, అధికారులు, ఆర్పీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..


కురుపాంలో సంఘీభావ ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

యువగళం పాదయాత్రకు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర గురువారంతో 200 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి ఆధ్వర్యంలో దూలికేశ్వర ఆలయం నుంచి సాయిరాం గుడి వరకు సంఘీభవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. ఇందుకు నిదర్శనమే యువగళం పాదయాత్రలో జన సంద్రమేనన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు కె.వి. కొండయ్య, అక్కిన మధు, నాయకులు డొంకాడ రామకృష్ణ, నందివాడ కృష్ణబాబు, సుకేష్ చంద్ర పండా, ఐదు మండలాల టిడిపి నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: వైసిపి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా టిడిపి యువనేత లోకేష్ పాదయాత్ర కి అపూర్వ లభిస్తోందని నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి అన్నారు. గురువారం లోకేష్ యువగళం పాదయాత్ర 200రోజులు పూర్తయిన సందర్భంగా ఇంఛార్జి సంధ్యారాణి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పీ భంజ్ దేవ్, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, సీనియర్ నాయకులు ఎం.సూర్యనారాయణ, పి.ఈశ్వరరావు, మావుడి ప్రసాదరావునాయుడు పాల్గొన్నారు.

ర్యాలీకి ముఖ్యనాయకుల డుమ్మా

లోకేష్ యువగళం పాదయాత్ర 200రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన ర్యాలీలో ముఖ్యనాయకులు కనిపించలేదు. పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, మక్కువ మండల సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు గైర్హాజరయ్యారు. మండల పార్టీ బాధ్యులే రాకపోవడంతో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు కూడా హాజరు కాని పరిస్థితి కనిపించింది.

పార్వతీపురం రూరల్ : నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర 200 రోజులు చేరుకోవడంతో పార్వతీపురం నియోజకవర్గ టిడిపి నాయకులు ఆయనకు సంఘీభావంగా పాదయాత్రను నిర్వహించారు. టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్ర పార్వతీపురం వెంకంపేట ఫరీ లో కూడలి నుండి ఎమ్మార్ నగరం వరకు కొనసాగింది ఈ యాత్రలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, ఎఎంసి చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, జి.వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, కౌన్సిలర్లు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతంపేట : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేటికీ 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ నాయకత్వంలో సీతంపేట సంత సెంటర్ నుండి ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ పుదిలాపు కష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మాజీ కోఆప్షన్ సభ్యులు సుంకరి అనిల్ దత్, వెన్నపు శ్రీను, పాలకొండ పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు గంట సంతోష్, గండి రామినాయుడు, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల అధ్యక్షులు సవర తోట మొఖలింగం, భోగాపురపు రవినాయుడు,ఉదయాన ఉదయ భాస్కర్, సీనియర్ నాయకులు మెడిబోయిన జగదీశ్, మాజీ ఎంపీపీ భూపతి ఆనంద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాలూరు, సీతంపేటలో సంఘీభావ యాత్ర చేస్తున్న టిడిపి నాయకులు


పార్వతీపురంలో సంఘీభావ ర్యాలీచేస్తున్న టిడిపి నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - గురుగుబిల్లి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఏ గ్రామంలోనైనా జ్వరాలు ప్రబలితే తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అదుపులోకి తీసుకు రావాల్సి ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గరుగుబిల్లి, రావివలస పిహెచ్‌సిల వైద్యాధికారులతో గురువారం సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి తగు సూచనలు, సలహాలను అందజేశారు. అలాగే ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్వరలక్షణాలతో ఎవరొచ్చినా వెంటనే పరీక్షలు జరిపి, తగు చికిత్సలు అందజేయాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమానికి టీకా కోసం సర్వేలో గుర్తించిన పిల్లలు, గర్భిణీలను యూవిన్‌లో అప్లోడ్ పూర్తి చేయాలన్నారు. రక్తహీనత గుర్తించిన విద్యార్థులకు ప్రతిరోజూ ఐరన్ ఫోలిక్ ట్యాబ్లెట్లను వేయించాలన్నారు. పిల్లలకు వేసిన ఐరన్, విటమిన్ ఎ ద్రావణాలు నమోదు, నవజాతశిశువుల గృహ సందర్శన ఆరోగ్య పరిశీలన వివరాలు మొదలగు వాటిని ఇ-ఆశా యాప్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ద్వారా అందజేస్తున్న వైద్య సేవలు గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ పి.ఎ.ప్రియాంక, డాక్టర్ కర్రి అరుణకుమారి, డాక్టర్ కె.కె. సాగర్ వర్మ, హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, ఆరోగ్యసిబ్బంది అల్లు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు గిరిజనుల సొంతం

ప్రజాశక్తి - పాచిపెంట

తక్కువ భూమిలో ఎక్కువ పంటలు, తక్కువ నీటితో ఎక్కువ సాగు ఏకపంట విధానం కాకుండా బహుళ పంటల విధానం ఎంతో మేలని ఈ విధానాలు గిరిజనుల సాంప్రదాయ సాగు విధానాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని గొట్టూరు, కుడుమూరు, కన్నయ్యవలస, వేటగానివలసలో పంటలను వ్యవసాయ అధికారి పరిశీలించారు. వ్యవసాయ శాఖ ద్వారా శత శాతం రాయితీపై ఇచ్చిన కంది విత్తనాలను గిరిజనులు పూర్తిగా సద్వినియోగం చేశారని, పత్తిలో అంతర పంటగా కంచెపంటగా వేయడమే కాకుండా చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు వంటి పంటలను అంతర పంటలుగా వేయడమే కాకుండా వరి పంట గట్లపై కూడా చిక్కుడు, బెండ వంటి పంటలను సాగు చేస్తూ ఎక్కడ కూడా భూమి ఖాళీగా లేకుండా పంటలు వేశారని అన్నారు. ఈ విధానం పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుందని, జీవ వైవిధ్యాన్ని పెంచుతుందని మేలు చేసే కీటకాల సంఖ్య పెరగడంతో పాటు మానవ మనుగడకు ఎంతో అవసరమైన తేనెటీగల వృద్ధి చెందడానికి ఉపయోగపడతాయని అన్నారు. సిఆర్‌పి కర్రి శ్రీనివాసరావు, ఐసిఆర్‌పి చదల సంజీవరావుతో పంటలను పరిశీలించారు. రైతు డుంబర రాము తన పత్తి చేలో వేసిన బెండ, చిక్కుడు, గోంగూర, కాకర వంటి పంటలను చూపించి వర్షం పడిన వెంటనే మినుములు చల్లుకుంటామని, రాయితీ విత్తనాలను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ భారతి పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన ప్రాంతంలో నిర్మిస్తున్న రహదారుల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో మున్నాళ్లు ముచ్చట గానే అవి మిగులుతున్నాయి. దీంతో ఇవి నిర్మించిన కొద్ది కాలానికే శిథిలవుతున్నాయి. ఇందుకు నిదర్శనం మండలంలోని కేదారిపురం నుండి వంగర వెళ్లే ప్రధాన రహదారి. ఈ రోడ్డు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. దీంతో నాలుగు నెలల కిందట మరమ్మతులు చేపట్టారు. నిర్మించిన మూడు నెలలకే సిసి రోడ్డు బీటలు వారింది. రహదారి పూర్తిగా కుంగిపోయే పరిస్థితి ఉందని టిడిపి మహిళా నాయకులు కడ్రక నాగవేణి పేర్కొన్నారు. దీనివల్ల ఆర్టీసీ, ప్రైవేట్ వాహన రాకపోకులకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆమె కోరారు.


బీటలు వారిన కేదారిపురం- వంగర వెళ్లే ప్రధాన రహదారి

రహదారి భద్రత పట్ల అవగాహన

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

రహదారి భద్రత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనదారుడు అన్ని పత్రాలు కలిగి ఉండాలని, పరిమితికి మించిన వేగంతో ప్రయాణించరాదని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిడ్డిక బీముడు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వైకెఎం కాలనీలో గొలుసు దొంగతనాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణంతోపాటు శివారు కాలనీలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు వస్తువులే లక్ష్యంగా తరచూ గొలుసు దొంగతనాలు జరుగుతున్న సంఘటనలతో మహిళలు బెంబేలెత్తుతున్నారు. గత ఆరు నెలల్లో పదులకొద్దీ జరిగిన సంఘటనల నేపథ్యంలో గురువారం ఉదయం జన సమర్థంగా ఉన్న వైకెఎం నగర్ కాలనీలో మార్నింగ్ వాక్ చేస్తున్న ఒక మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని దుండగుడు తెంపుకుపోయిన సంఘటన జరిగింది. ఈ ఘటనలో 15 గ్రాముల బంగారు పుస్తెలను దొంగిలించినట్లు మహిళ తెలిపింది. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పోలీసులు పట్టుకోవడం, వస్తువులను రికవరీ చేయడం లేదు. దీంతో బాధితులు ఫిర్యాదు చేయడానికి కూడా ఆసక్తి చూపించడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ సంఘటనలను నిరోధించి ప్రజల్లో మనోధైర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సారా రవాణాపై దాడులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో గురువారం ఒడిషా నుంచి ఆంధ్రాకు నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో మండలంలోని ములగ గ్రామ సమీపంలో మాటు వేసి 80 లీటర్ల నాటు సారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి తానవలస గ్రామానికి చెందిన మండంగి చిన్నారావు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అలాగే కృష్ణపల్లి సమీపంలో 160 లీటర్ల నాటుసారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, పాతరెల్లివీధికి చెందిన రాయిపల్లి జెన్నును అరెస్టు చేశారు. ఈ కేసులకు సంబంధించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్ఐ వి.వి.రమణ,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.